# వారసుడు వచ్చాడు

"హరికృష్ణా, పద్మనాభరావు మాస్టారు చెప్పింది నిజమేనా!" హెడ్‌మాస్టరు అడుగుతుంటే హరికృష్ణ భయంతో ఆ యిద్దరి ముఖాలవంకా చూశాడు.

"చెప్పు? ఈ మాస్టారు చెప్పేది విన్నావుగా? దీనికి నీ సమాధానమేమిటి?"

"సర్, నేను హాల్లోకి వచ్చి నాసీట్లో కూర్చుని క్వశ్చెన్ పేపరు చూసుకుంటూ జవాబు రాస్తున్నాను. నేను తలతిప్పి దిక్కులు కూడా చూడలేదు. టైము చాలదేమోనని భయపడుతూ రాస్తున్నాను. నాకింకేమీ తెలియదు సర్." అన్నాడు చేతులు కట్టుకుని.

"నీవు ఎనిమిది క్లాసులు ఇక్కడ చదివావు. ఇంత కాలంనుంచీ నీవు భయభక్తులుగల మంచి పిల్లవాడి వనుకున్నాను. నీకు మంచి అభివృద్ధి ఉందని ఆశించాను. కాని-ఇవాళ ఇంటిదగ్గర రాసుకువచ్చిన కాగితాలు నీ బెంచికింద కనబడ్డాయని మాస్టారు తీసుకు వచ్చారు. నీవు వాటిని చూసి రాస్తుండగా ఇద్దరు పిల్లలు కూడా చూశారట. వెంటనే వాటిని నలిపి బెంచికింద పడేశావట. నీమీద నాకున్న నమ్మకాన్ని వమ్ము చేశావు. నీవు కాపీచేస్తూ పట్టుబడ్డావు. కనుక ఈ పరీక్ష నీవు రాయటానికి వీలులేదు. ఆ కాగితాలు చింపేస్తాను నీవు ఇంటికి వెళ్ళచ్చు. కాని ఒక స్కూల్లో పరీక్షా సమయంలో నీవు చేయకూడని పనిచేశావు కనుక నీకీ శిక్ష చాలదు. చెయ్యిపట్టు" అంటూ మూలనున్న కేన్ తీసుకున్నాడు.

"చేతులు చాపు" అరిచాడు.

చాచిన వెంటనే అతడి అరచేతులు ఎర్రబడి పొంగే వరకూ కొట్టి "ఈ వైపుకు ఇంకరాకు, తిన్నగా యింటికి వెళ్ళు. నీకీ శిక్ష పడితే మిగత పిల్లలకు బుద్ధి వస్తుంది" అని వెనక్కు తిరిగాడు హెడ్‌మాస్టరు.

"సర్. నేను అటువంటిపని చెయ్యలేదు. నేను కాపీ కొట్టటంగాని, ఇంటి

దగ్గర రాసుకు వచ్చిన కాగితాలు చూసిరాయటంగాని, ఇంతవరకూ ఎరగను సర్. నామాట నమ్మండి సర్." ఏడుస్తూ నిలబడ్డాడు హరికృష్ణ.

"ఇంక మాటలు అనవసరం. నీవు పట్టుబడిపోయావు. ఇంక ఇంటికి పో. ఇంకా ఇక్కడే ఉంటే మళ్ళీ ఒకసారి కేన్ తీసుకోవలసి వస్తుంది. దీనికి తిరుగు లేదు" వెళ్ళి తన బల్లమీది కాగితాలు చూసుకోవటం మొదలుపెట్టాడు. ఆయనకు హరికృష్ణ వెక్కివెక్కి ఏడుస్తూ గోడకానుకుని నిలబడటం కిటికీలోనుంచి కన బడుతునే ఉంది.

అరగంటకు పైగా నిలబడి, పిల్లలందరూ పరీక్ష పేపర్లురాసి బైటికి వచ్చే వేళయింది. వాళ్ళ ముఖాలు చూడలేన"ను కుంటూ హరికృష్ణ అక్కడినుంచి మెల్లగా కదిలి గేటుదాటాడు-బరువుగా అడుగులు వేస్తూ.

ఉదయం తొమ్మిదిగంటలకు చద్దిఅన్నంతిని కలమూ పాడ్ తీసుకుని ఇంటినుంచి బయలుదేరాడు. నాలుగు రోజులనుంచీ రాత్రిళ్ళు నిద్రయినా లేకుండా చదివాడు ఈ పేపరు రాయటానికి. చివరకు జరిగిందిది. అంతా వ్యర్థమయి పోయింది.

ఈ స్థితిలో తను ఇంటికి వెళ్తాడా? వెళ్ళలేడు. తనమీద ఎన్నో ఆశలు పెట్టుకుని తల్లి పాచిపనులు చేస్తూ చదివిస్తున్నది. కాని ఆమె నోరుతెరిచి తిట్టటం మొదలుపెట్టిందంటే ఆ వాడంతా వినబడుతుంది. కొట్టటం మొదలు పెట్టిందంటే ఎముకలు విరగవలసిందే.

"నీకు పుస్తకాలు కొనిచ్చి, ఫీజుకట్టి, అన్నంపెట్టి చదివిస్తుంటే వెర్రి ముఖం వేసుకుని పరీక్ష రాయకుండా వస్తావా? నాకు పిల్లలులేరని, చివరికి గొంతులో ఇన్నినీళ్ళు పోస్తావని నేను తినకుండా చదివిస్తున్నానన్న సంగతి తెలుసులేకపోయావు. బుద్ధి గడ్డితిని, ఆ లింగమ్మ తీసుకువస్తే నిన్ను ఆమె చేతుల్లోంచి అందుకున్నాను. కష్టపడి పెంచుతున్నందుకు బాగా బుద్ధిచెప్పావు" ఇటువంటి మాటలు ప్రతిరోజూ వింటూనేఉన్నాడు.

"ఇవాళ నన్ను చూడగానే ముఖమ్మీద నిప్పులు పోస్తుంద"నుకున్నాడు.

హరికృష్ణ అరచేతులు సెగలై పొగలై మండిపోతున్నాయి. వాటిని చూసు కుంటూ వీధిలో నడుస్తున్నాడు. అతడు తిన్న గుప్పెడుమెతుకులతో కడుపు

నిండక-ఆకలిమంట బయలుదేరింది. దానికి తోడు అరచేతి మంటలు అతడికి కన్నీళ్ళు తెప్పిస్తున్నాయి.

దాదాపు అతడు ఆ ఊరి పొలిమేరలు దాటాడు.

పెద్ద చెరువులో పిల్లలు ఈదులాడుతూ గొడ్లను కడుగుతున్నారు. నీళ్ళు మురికిగా ఉన్నాయని అతడు చెరువుకు అవతలి ఒడ్డుకువెళ్ళి అరచేయి కడుక్కొని నీళ్ళు తాగాలని ప్రయత్నించాడు. కాని వాచిపోయిన వేళ్ళు వంగలేదు. రెండు చేతులూ కొంతసేపు నీళ్ళల్లో ఉంచి దోసెళ్ళతో కష్టమ్మీద కడుపునిండా తాగాడు.

అక్కడి ఊళ్ళు చిన్నచిన్నవయినా ఒక చెరువో కాలవో ఉంటుంది. ఊరి జనాభాను బట్టి ప్రాథమిక పాఠశాల గాని మాధ్యమిక పాఠశాలగాని ఉంటుంది.

హరికృష్ణ కొంచెంసేపు చెరువుగట్టున కూర్చుని లేచి ఇంకా ముందుకు ఆ దారినే నడవ నారంభించాడు-కొంత సేపయిన తరువాత-దారిలో.

"తను చదువుతున్నది తొమ్మిదవ క్లాసు. ఆమె ఎవరయినా ఎటువంటి దయినా తిట్టినా కొట్టినా ఇంతవరకూ తీసుకువచ్చింది. అందుకు ఆమెకు తన కృతజ్ఞతలు" అనుకుంటూ తను దాటివచ్చిన ఊరివైపు తిరిగి రెండుచేతులూ జోడించాడు. ఆ గ్రామానికి కూడా ఒకసారి నమస్కరించాడు.

హరికృష్ణ బయలుదేరినది మధ్యాహ్నమయినా మబ్బువల్ల చల్లగాలి వీస్తున్నది. ఆ చల్లటి గాలిలో చేతులు ఊదుకుంటూ అరచేతులు పైకెత్తి పట్టుకుని నడుస్తున్నాడు. అతడు పక్కఊళ్ళోకి అడుగు పెట్టినట్టుగా ఇళ్ళు బారులుతీర్చి వీధికి రెండుపక్కలా ఉన్నాయి. కొంతదూరం నడిచి ఒక యింటిముందు రాతి మీద కూర్చుని అలుపు తీర్చుకుంటున్నాడు.

ఆ మరునాడు హెడ్‌మాస్టరు హరికృష్ణకోసం మనిషిని పంపించాడు. అతడు ఎక్కడా కనబడలేదు.

"ఎవరు బాబూ నీవు ? ఎక్కడినుంచి వస్తున్నావు?" అరుగుమీద కూర్చున్న వృద్ధురాలు కళ్ళకు చెయ్యి అడ్డంపెట్టుకుని అడిగింది.

అతడు తలఎత్తి "నేను-- నేను చదువుకుంటున్న వాడిని" అన్నాడు కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా.

"విద్యార్థివా ? ఏం చదువుతున్నావు ?"

"తొమ్మిదవ క్లాసు."

"సెలవులు ఇచ్చారా ?"

"లేదు, పరీక్షలు జరుగుతున్నాయి. మళ్ళీ వచ్చేఏడు రాస్తాను"

"ఇంటికి వెళ్ళుతున్నావా ?"

"నాకు ఇల్లు లేదమ్మా"

"మరెటుపోతున్నావు ? ఎక్కడికని నీ ప్రయాణం ?"

"నేనొక అనాథను తల్లీ ! జీవితంలో దారి వెతుక్కుంటున్నాను"

"అయ్యోబాబూ! దారివెతుక్కుంటూ బయలుదేరావా? లోపలికిరా. నీకు దారి దొరికేవరకూ. ఎప్పుడు అన్నం తిన్నావో ! పట్టెడు మెతుకులు తిందువుగాని." ఆమెలేచి అతడిని తీసుకుని లోపలికివెళ్ళి, బాదమాకుల విస్తట్లో అన్నం పప్పు కూర వడ్డించి గ్లాసుతో మంచినీళ్ళు పెట్టింది.

అతడు విస్తరిముందర కూర్చుని, దగ్గరకురాని వేళ్ళతో అన్నంలో పప్పు కలపాలని మునివేళ్ళతో ప్రయత్నించాడు. కలిసీ కలవని ఆ అన్నం ఒకచోటికి చేర్చి, విస్తరికి దగ్గరగావంగి నోటిదగ్గరికి తీసుకువెళ్ళటానికి ప్రయత్నిస్తున్నాడు.

"ఏం బాబూ ! అట్లా తింటున్నావు ?"

"అరచేతులకు దెబ్బతగిలిందమ్మగారూ."

"అందుకా అట్లా తింటున్నావు ? ఈ చంచాతో తినటానికి ప్రయత్నించు" ఒక చంచా తెచ్చియిచ్చింది-దగ్గరగా కూర్చుంటూ.

అతడు దానిని సరిగా పట్టుకోలేక పోవటంచూసి "ఉండు-నేను పెడతాను ఆ చంచాతో" అన్నంలో పప్పుకూర బాగా కలిపి ముద్దలుచేసి నోటికందించింది. పులుసూ మజ్జిగ అన్నంకూడా అలాగేపెట్టి గ్లాసెడు మంచినీళ్ళు తాగించి, అతడి చేతులూ మూతీ కడిగింది.

"అమ్మగారూ, నాకు కడుపునింపి మంచినీళ్ళు మీ చేత్తో తాగించారు.

ఆప్యాయంగా బాబూ అని పిలిచారు" అంటూ వంగి ఆమె పాదాలను కళ్ళకద్దుకున్నాడు.

"ఇప్పుడే అన్నం తిన్నావు. ఎక్కడికీ వెళ్ళకు. అరుగుమీద చాపవేస్తాను. పడుకో. నిద్రలేచేవరకూ కొంచెం చేతులనొప్పి తగ్గుతుంది" చాప పరిచింది. అతడు కొంచెంసేపు నీరవుడై నిలబడి, అలసిపోయినదేహాన్ని చాపమీదికిచేర్చాడు. మానసికంగా శారీరకంగా అలసిపోయిన అతడికి వెంటనే కళ్ళు మూతలుపడ్డాయి.

ఆమెకు తనసంగతి తలుచుకుంటే తనకే ఆశ్చర్యంవేసింది. అతడెవరో తెలియదు. కాని - అతడినిచూడగానే లోపలికిపిలిచి, ఊరూ పేరూ తెలుసుకుని అన్నం పెట్టాలనిపించింది. తినలేకపోతే కలిపి నోట్లో పెట్టింది. ఆమెకు అతడిని చూడగానే ఆ ముఖవర్చస్సు, పొడుగుపాటిచేతులూ పరచుకునిఉన్న ఆ పాదాలూ వేళ్లూ గమనించి అతడు తనకు ఆత్మీయుడనిపించింది. వెంటనేలేచి కొబ్బరినూనె తీసుకువచ్చి అరచేతులకు రాచింది.

ఆమెపేరుగోవిందమ్మ. ఆమె తనఏకైకకుమార్తెకు పెళ్ళిచేసి అత్తవారింటికి పంపింది. రెండుసంవత్సరాల తరువాత కాన్పుకు తీసుకువచ్చింది. కూతురికి, తాతగారి రూపురేఖలతో కొట్టవచ్చినట్టు కనబడే ముఖవర్చస్సుతో మగపిల్లవాడు పుట్టాడు. నామకరణం రోజున చేతులకు మురుగులూ, మెడలోకి పులిగోరు పతకం వేసిన గొలుసూచేయించిపెట్టింది. పిల్లవాడికి తాతగారిపేరు అమర్‌నాథ్ అని పెట్టించింది.

కూతురు అత్తవారింటికి వెళ్ళేనాడు - "అమ్మా నీవు మాతో రాకూడదూ?" అంటూ గునిసింది. నోరుతెరచి అడిగిన కూతురుమాటలు తోసివెయ్యలేక కూడా వెళ్ళి వారంరోజులుండి వచ్చింది.

ఏడాదిలోపున ఒకసారి వచ్చివెళ్ళమని తల్లి ఉత్తరంరాయిస్తే, కొడుకునెత్తుకుని వచ్చింది. పిల్లవాడు గోవిందమ్మనెంతో మురిపిస్తున్నాడు. ఆమెకతడితో కాలక్షేపం బాగా జరుగుతున్నది.

ఆ ఊరిలో అంటువ్యాధులు బయలుదేరితే ఊరంతా తుడిచిపెడతాయి. ఇది ప్రతి సంవత్సరమూ జరిగేదే. ఆ సంవత్సరం కలరావ్యాధి వ్యాపించింది. గోవిందమ్మ కూతురికి ఆ వ్యాధిసోకి నాలుగురోజులలో చనిపోయింది.

గోవిందమ్మ ఇప్పించినమందులు ఎందుకూ కొరగాకుండా పోయాయని స్పృహలేకుండా పడిపోయింది. ఊరి జనమంతా పోగయ్యారు. కొందరు ఆమెను పట్టుకుని కూర్చున్నారు. కొందరు అంత్యక్రియలకు ప్రయత్నాలు చేయసాగారు. ఆ సందడిలో ఏడాది దగ్గరదగ్గరున్న అమర్‌నాథ్ పాకుతూ ఎటువెళ్ళినదీ ఎవరూ చూడలేదు.

గోవిందమ్మ గారాబాలకూతురు అగ్నికి ఆహుతిఅయిన తరువాత పిల్లవాడు జ్ఞాపకంవచ్చి అందరూ వెతకటం మొదలుపెట్టారు. ఈ సంగతివిన్న గోవిందమ్మ గొల్లున ఏడ్చింది.

వెతికి వెతికి అందరికీ ప్రాణం అలసిపోయినట్లయింది. పిల్లవాడి ఒంటిమీది నగలకోసం ఎవరో ఎత్తుకుపోయారని నిశ్చయంచేసుకున్నారు. పిల్లవాడి ఫొటోతో పోలీసురిపోర్టుకూడా ఇచ్చారు. కాని లాభంలేకపోయింది. వచ్చినతండ్రి వట్టిచేతుల తోనే వెళ్ళిపోయాడు. గోవిందమ్మతో "పిల్లవాడుదొరికితే పెంచండి. పెద్దవాడైన తరువాత తీసుకువెళ్తాను" అని కళ్ళు తుడుచుకున్నాడు అల్లుడు.

తనను పిల్లవాడిని పెంచమని అల్లుడన్నందుకే గోవిందమ్మ మురిసి పోయింది.

రోజులుగడుస్తున్నాయిగాని పిల్లవాడి జాడలేదు. అప్పటినుంచీ గోవిందమ్మ వీధి అరుగుమీద మంచంవాల్చుకుని కూర్చుంటుంది ఎవరయినా మనమడిని తీసుకు వస్తారేమోనని.

మరి రెండేళ్ళ తరువాత అల్లుడు "నేను తిరిగి వివాహము చేసుకున్నాను. పిల్లవాడు పెద్దవాడయిన తరువాత నాదగ్గరికి పంపండి" అని ఉత్తరంరాశాడు,

"అవును. తల్లిపోతే తండ్రి పినతండ్రితో సమానం. ఆయనకు పిల్లలు పుడతారుగాని నాకు మనమడెక్కడినుంచి వస్తాడు?" అనుకుని బాధపడ్డది.

గోవిందమ్మకు బాగా ధరచేసే నాలుగెకరాల పసుపుతోటఉంది. వెండి బంగారం ఇత్తడిసామానూ కొంతనగదూ చేతిలోఉన్నది పెద్ద యిల్లుంది.

"కూతురు చనిపోయింది. మనమడు అపహరింపబడ్డాడు. గోవిందమ్మ ఎన్నాళ్ళు బతుకుతుంది? చివరకా నాలుగెకరాల పసుపుతోట మిగతా

నగానట్రా "మనకొచ్చేదే" అని దాయాదులు ఊహాగానాలుచేయటం మొదలు పెట్టారు.

"గోవిందమ్మా, ఒక్కదానవూ ఇంత ఇంట్లో ఏంఉంటావు? మనవాళ్ళ నెవరినయినా తోడుంచుకో ఇంట్లో. లేకపోతే మా దగ్గరకొచ్చిఉండు"అనసాగారు.

"నేను ఎప్పటికయినా వచ్చేదాన్నే. కాని ఇప్పటినుంచీ ఎందుకు? పెద్దలు కట్టినఇంట్లోఉంటాను. వండుకునితింటాను చేతకాకపోతే మనిషిని పెట్టుకుంటాను. మీరు చెప్పినమాటను మరిచిపోను. నాకయినా మీరుతప్ప ఇంకెవరున్నారు?" అనేది.

ఇల్లంతా అద్దెకిచ్చి తనకొకగదీ వంటయిల్లూ ఉంచుకుంది. భోజనంచేసి కొంచెంసేపు నడుంవాల్చి వాకిట్లో మంచంవాల్చుకుని కూర్చుంటుంది దారిన పోయేవాళ్ళను చూస్తూ.

పాపమామె ఒంటరిది. వయసుమళ్ళినది ఆమె పరిస్థితిచూసి అద్దెకున్న ఆసామి ఏనాడేం అఘాయిత్యం జరుగుతుందోనని జంకేవాడు.

ఒకనాడు-"అమ్మగారూ, మీ దాయాదులకు పసుపుతోటమీద మీ ఆస్తిమీద కన్నుబడ్డది. దాన్ని చేతచిక్కించుకోవటానికి అనేక పన్నాగాలు పన్నుతున్నారని తెలిసింది మీరు ఆస్తిఅంతా అమ్మి డబ్బుగా మార్చుకోండి. ఈ యిల్లుకూడా అమ్మెయ్యండి. మీరు తిరుపతి కొండమీదికివెళ్ళి స్వామివారి దర్శనంచేసుకుంటూ హాయిగా ఉండండి. ఎవరికీ తెలియకుండా వెళ్ళిపోండి. నేను మీకు రాబోయే కష్టాలను ఊహించి చెబుతున్నాను. ఆలోచించుకోండి. నేను నిర్మలమైన మనసుతో మీకు సహకరిస్తాను" అన్నాడు.

ఆమె నాలుగురోజులు ఆలోచించింది. ఆమె తన భర్తతో ఆ యింట్లో కాపరంచేసింది. కూతురిని అల్లారుముద్దుగా పెంచి అక్కడే పెళ్ళిచేసింది. సుఖ సంతోషాలతో చాలాకాలం బతికింది. తరువాతనే కష్టాల కడలిలో పడ్డది.

"అవును, డబ్బూ ఆస్తి జీవితంలో సుఖంకంటె కష్టాలనే ప్రాప్తింపచేస్తాయి. వీటన్నిటినీ అమ్మి ఒక సత్కార్యం తలపెట్టాలనుకుంది.

"అద్దెకున్న ఆసామీని పిలిచి "మీ సహృదయాన్ని నేను కనిపెట్టాను.

తోటివారికి సహాయపడేవారే గాని నష్టం "కలుగచేసేవారుకాదు" అని తన ఆస్తి రహస్యంగా తన క్షేమాన్ని కాంక్షించేవారి సహాయంతో ధర చేయించింది. ఇక అమ్మటమే తరువాయి.

అద్దెకున్న ఆసామికూడా సహకరించాడు. "అమ్మగారూ. ఇదంతా ఇంటితో కూడా నేనే కొనుక్కుని, రెండో కంటికి తెలియకుండా రిజిస్టరు చేయిస్తాను. నేను వచ్చి మీరు ఎక్కడుంటేఅక్కడ మీకు బ్యాంకు ఎకౌంటు పెట్టిస్తాను. మీకు సంతకం చేయటంవచ్చు. లెక్కలు తెలుసు. ఎంత కావాలంటే అంతే బ్యాంకులో నుంచి తెచ్చుకోండి" అన్నాడు.

ఆమె అన్నిటికీ సమ్మతించింది. కాని ఒంటరిగా ఉండగలనా అని ఆలో చిస్తున్నది.

ఆ డబ్బు ఆరులక్షలకు పైగా ఉంది. తన తరువాత హుండిలో వేయమని రాసి అధికారులకివ్వటానికి కూడా నిశ్చయించింది.

ఆ మూడేనాడే హరికృష్ణ పిలిచినట్టుగా యింటికి వచ్చాడు. ఆమె నోట్లో పెట్టిన అన్నం ఆతురతతో తిన్నాడు.

హరికృష్ణను చూడగానే గోవిందమ్మ మనసు ఎందుకో పొంగిపొరలి పోయింది. దొంగిలించిన వాళ్ళు పేరు మార్చగలిగారు గాని ఎదుగుతున్న పిల్ల వాడి రూపురేఖలు మార్చలేకపోయారని పిస్తుంది. ఆమెకు అతడిని చూసినప్పు డల్లా అతడి ముంజేతి మీదున్న పెద్ద పుట్టుమచ్చను ఎవరు తుడిచివేయగలరు? అమర్‌నాథశాస్త్రికి సరిగా అక్కడే పెద్ద పుట్టుమచ్చఉండేది.

అతడు ముమ్మూర్తులా అమర్‌నాథశాస్త్రి. బైటనుంచి ఆయన ఇంట్లోకి వచ్చినట్టే ఉంటుంది. ఈ విషయమే అస్పష్టంగా గోవిందమ్మ మనసులో మెది లినా బయటపడలేదు. ఆమే కాదు శాస్త్రిగారిని బాగా ఎరిగినవాళ్ళు కూడా హరి కృష్ణను తేరిపారజూస్తున్నారు. వాళ్ళకు పాత స్మృతులు కళ్ళకు కట్టినట్టుగా ఉన్నాయి.

రాత్రిభోజనం హరికృష్ణకు మాత్రమే తయారుచేసిపెట్టింది. తను గ్లాసుతో పాలు తాగుతూ "బాబూ, మనం రేపుఉదయం పదకొండుగంటల బండిలో తిరుపతి వెళ్ళుతున్నాము. నీవు నాతోకూడా వస్తున్నావు" అన్నది.

"అక్కడెవరున్నారమ్మగారూ ?"

"అక్కడ వేంకటేశ్వర స్వామి ఉన్నాడు. భజనలూ స్వామివారి సేవలూ కళ్యాణోత్సవాలూ నిత్యమూ జరుగుతాయి. ఇసుకవేస్తే రాలని జనం ఎప్పుడూ ఉంటారు సందడిగా. నీవు చదుకోవాలంటే ఏర్పాటుచేస్తాను. కింది తిరుపతిలో స్కూళ్ళూ కాలేజీలున్నాయి. బస్సులోవెళ్ళి బస్సులో రావచ్చు అన్నది.

అతడు అమితానందంతో "అవునా అమ్మగారూ ? అయితే నేను చదువుకోనా ?" అన్నాడు.

ఆమెకెందుకో కన్నీళ్ళొచ్చాయి.

హరికృష్ణ ఇప్పుడామెకు వంటచేసి పెడుతున్నాడు. మధ్యాహ్నం ఆమె పడుకున్నప్పుడు అమ్మగారు కాళ్ళు "వత్తనా" అని అడిగి కాళ్ళువత్తుతాడు. ఆమె బట్టలుతుకుతాడు.

ఆమె ఏమీ మాట్లాడదు. ఆమె కంటిఎదుట అమర్‌నాథశాస్త్రి కనుపిస్తాడు.

ఆనాడు హరికృష్ణ ఒక్కడే భక్తులందరితో కలిసి తిరుగుతున్నాడు. అక్కడ చెట్టుకింద కొందరు కూర్చుని "అమర్‌నాథశాస్త్రుని ఒక ఆయన వారానికొకసారి వచ్చి స్వామిని సేవించుకుని కనబడిన వారందరికీ రూపాయ చొప్పున ఇచ్చేవాడండీ. మంచి మానవత్వమున్న భక్తుడు. పేదలకు వస్త్రదానం చేసేవాడు. స్వామివారి లడ్డూలు కొని వాళ్ళకు పంచేవాడు. ఆయన ముఖవర్చస్సు, ఆ మాట గాంభీర్యము చూస్తే ఆయన ఏదైవ సంభూతుడో ననుకోవాలి."

"ఆయన ఎవరమ్మా అందరూ ఆయనను చాలా శ్లాఘిస్తున్నారు. నీవెరుగుదువా ?" అని హరికృష్ణ గోవిందమ్మను అడిగితే ఆమె ఆనందబాష్పాలతో ఆయన రూపము నా మనసులో ఒకమాదిరిగా హత్తుకుపోయింది. పైకి బిడ్డలా అనిపిస్తుంది. అనుకుని, నాకు తెలుసు" అన్నది.

పగలు పడుకుంటుందిగాని ఆమె తెల్లవారకముందే లేస్తుంది. హరికృష్ణ నీళ్ళు కాగబెట్టి ఇస్తాడు. ఆమె స్నానంచేసి పట్టుబట్ట కట్టుకుని హరికృష్ణతో దేవాలయానికి వెళ్ళి స్వామి దర్శనం చేసుకుంటుంది. స్వామివారి సేవలు భక్తులు చేయిస్తుంటే చూస్తుంది. పాలు తెప్పించుకుని తను తాగి, హరికృష్ణను హోటల్‌కి పంపుతుంది.

ఆమె యింటి ఆసామీవచ్చి ఆ ఇద్దరిపేర్లమీద ఎక్కౌంటు పెట్టించాడు. "అమ్మగారిని బాగా చూసుకో. నేనూ వస్తూఉంటాను." అని హెచ్చరిస్తూ ఉంటాడు హరికృష్ణను చూసి.

ఆనాడు భక్తులెవరో స్వామికి సహస్రఘటాభిషేకం చేయిస్తున్నారు. గోవిందమ్మ పాలుపండ్లు తీసుకుని ఆ వైభవాన్ని పూర్తిగా చూసింది. మరెవరో ఊంజలసేవ చేయించారు. ఆమె పరవశంతో చూడసాగింది. ఆ రాత్రి అలసిపోయి నిద్రపోయింది. తెల్లవారుఝామున ఒక కల-ఆమె సంశయాలనన్నిటినీ పటాపంచలు చేస్తూ వచ్చిందా స్వప్నం.

"హరికృష్ణ పేరు మారింది. కాని వాడు నీమనమడు అమర్‌నాథ్. అతడికి బాగా చదువు చెప్పించి పెద్దవాడిని చెయ్యి. ఆ డబ్బు అతడి అభ్యుదయంకోసం ఖర్చుచెయ్యి. నాకు భక్తులు అనేకమంది కోటి కోరికలతో డబ్బు హుండీలో వేస్తూనే ఉంటారు" అని స్వామి స్వయంగా కలలోవచ్చి చెప్పాడు.

ఆమె దిగ్గున లేచికూర్చుంది.

"నా ఊహలు నిజమయ్యాయా స్వామీ. ఒక మంచిపనిచేస్తే నీకు చేసినట్లే ననుకోమన్నావు. అలాగేచేస్తా స్వామీ కాని నా చేతిమీదుగా ఏకోరికాలేకుండా కొంత సొమ్ము హుండీలో వెయ్యనివ్వు" అని కలలోనే వేడుకుని ఆమోదం పొందింది.

అమర్‌నాథశాస్త్రిని చూసినట్లే హరికృష్ణపట్ల ప్రవర్తిస్తుంది. అతడి సలహాలనే పాటిస్తుంది. కాని "మనుమడు మనుమడే." పసివాడు అనుకుంటుంది.

అతడు, కన్నుతెరిస్తే మనుమడు. కన్నుమూస్తే అమర్‌నాథశాస్త్రి.

ఆమెకు ఒక కన్ను మూగవేదనను అనుభవిస్తున్నట్టుగానూ-మరోకన్ను ఆనందబాష్పాలు కురిపిస్తున్నట్టుగానూ కనబడతాయి బాగాచూస్తే.